క్లుప్తంగా

బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక



భీమవరం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

భీమవరం: భీమవరం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం స్థానిక ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో వబిలిశెట్టి పట్టాభిరామయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కోట్ల నాని, వబిలిశెట్టి పార్థసారథి, ఉపాధ్యక్షుడిగా కారుమూరి కిరణ్, పున్నం శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా కనగర్ల విజయ రామకృష్ణ, బొండాడ నాగభూషణం, కోశాధికారి బొండా రామకృష్ణరావు (రాంబాబు) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని మార్నింగ్ కాఫీ క్లబ్, చైతన్య భారతి సభ్యులు అభినందించారు.

అక్రమ మద్యం విక్రయం కేసులో ఒకరి అరెస్టు



భీమవరంలో అక్రమ మద్యం కేసులో వ్యక్తిని అరెస్టు చేసిన దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని గరగపర్రు రోడ్డులోని బీవీ రాజు విగ్రహం వద్ద శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన మల్లుల భానుచంద్రను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు చెప్పారు. అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐలు పీవీవీఎస్ ఉమామహేశ్వర రావు, పి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు వైహెచ్ఏఐ మహాజన సభ

భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) భీమవరం యూనిట్ 36వ మహాజన సభలో ఈనెల 6వ తేదిన నిర్వహిస్తున్నట్లు యూనిట్ పీఆర్వో తాళ్లపూడి గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ కాలనీ బ్రహ్మయ్యనగర్‌లో కోపా కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. ఈ మహాసభలో నూతన కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని గాంధీ తెలిపారు.

శ్రీవారికి ఊంజల్ సేవ



ప్రత్యేక అలంకరణలో శ్రీవెంకటేశ్వరస్వామివారు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని జెపి రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఏర్పాట్లను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు పర్యవేక్షించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బాడీ బిల్డింగ్ పోటీలను జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఉపాధి కల్పనకు ఎంతగానో దోహదం చేస్తాయని భీమవరం ఎమ్మెల్యే ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)అన్నారు. శనివారం భీమవరం ఎల్‌హెచ్‌టౌన్ హాల్లో మినిస్టేట్ బాడీ బిల్డింగ్ పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా బాడీ బిల్డింగ్ జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజర్ వలవల ఫణి మాట్లాడుతూ వివిధ కేటగిరిల్లో నిర్వహిస్తున్న పోటీల్లో ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ విజేతకు రూ. 25 వేలు నగదు, అన్ని కేటగిరిలోని ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వాడపల్లి శ్రీనివాసరాజు, బాడీ బిల్డింగ్ వైస్ ప్రెసిడెంట్ పత్తి సురేష్, జిల్లా ప్రెసిడెంట్ కళారి రవిశంకర్, సెక్రటరీ షేక్ ఖాసీం, కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

నరసాపురం: పట్టణంలోని శ్రీ సూర్యా కళాశాలలో సోమవారం జిల్లా స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దిక్సూచి, పశ్చిమగోదావరిజిల్లా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సర్టిఫికెట్స్, రెజ్యూమ్‌ల జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు.

జగనన్న కాలనీలో సౌకర్యాలు కరువు

కనీస మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారుల అవస్థలు



కాళ్ళ లంకలోని జగనన్న కాలనీ



వేంపాడు జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి

కాళ్ల: కూటమి పాలనలో జగన్న కాలనీవాసులు నానా కష్టలు పడుతున్నారు. ముఖ్యంగా కాలనీల్లో రోడ్ల సమస్యలతో సతమతమవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవాడి ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పంతో నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రతి పేదవాడికి ఇంటి స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. దీంతో చాలా గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పడ్డాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జగనన్న కాలనీలను పట్టించుకోవడం లేదు. దీంతో కాలనీవాసులు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రమైన కాళ్ల, వేంపాడు తో పాటు నియోజకవర్గంలో పలు గ్రామంలోని జగనన్న కాలనీ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కాళ్ల గ్రామంలోని లంక రోడ్డు ప్రాంతంలో 'జగనన్న కాలనీ'లో గత ప్రభుత్వం హయాంలో 122 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అంతేకాకుండా దానిలో 30 లబ్ధిదారులు కొంత మంది ఇళ్ళు ను నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ కాలనీపై అధికారులు, నాయకులు శీతకన్ను వేశారు. గ్రామానికి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉన్న ఈ కాలనీలో సమస్యలు ఎన్నో ఉన్నాయి.

వంతెన సమస్య

ఈ కాలనీకి వెళ్లాలంటే పంట కాలువ దాటి వెళ్లాల్సిందే. ప్రస్తుతం కాలువపై తాత్కాలికంగా వేసిన చిన్న తూరల వంతెన మీదే రాకపోకలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో సమస్యను అధికారులు దృష్టికి, అప్పటి నాయకులు దృష్టికి తీసుకువెళితే శాశ్వత ప్రాతిపదికన ×పైపులు వంతెన₹ నిర్మాణానికి నాడు మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు కేటాయించింది. దీని నిర్మాణానికి ఇటీవల కాంట్రాక్టర్ పెద్ద పెద్ద తూములుతో పాటు, నిర్మాణ సామాగ్రి తెచ్చి పనులు ప్రారంభించకుండా వదిలేశారు. అయితే తూరలతో కాకుండా శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రహదారులు, వీధి లైట్లు

జగనన్న కాలనీలో ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షాకాలంలో అయితే వీటి పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా కాళ్ల గ్రామం నుంచి కాలనీకి రాత్రిపూట రావాలంటే భయభ్రాంతులకు గురి కావాల్సి వస్తుంది. వీధి లైట్లు లేకపోవడంతో చీకట్లో ఒక్కోసారి విష సర్పాలు కాళ్లకు అడ్డుగా వస్తు ఉండడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

తాగునీటికీ కటకటే

జగనన్న కాలనీలో నివసిస్తున్న వారికి రెండు రోజులకు ఒకసారి కుళాయి ద్వారా తాగునీరు వస్తుంది. అది కూడా సమయం కానీ సమయంలో ఇవ్వడంతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. ప్రస్తుత వేసవిలో రెండు రోజులకోసారి తాగునీరు అందిస్తే ఎలా? అని కాలనీవాసులు ప్రశ్నిస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో సౌకర్యాలు కల్పించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించేలా కృషి

"కాళ్ల లంకలోని జగనన్న కాలనీవాసులకు సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. పింఛన్లు కూడా ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తున్నాం. కాలనీ సమస్యలను ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లి సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తాం."

– సతీష్, కాళ్ల పంచాయతీ కార్యదర్శి

ఆక్వా రంగాన్ని తక్షణం కాపాడాలి



మాట్లాడుతున్న జేఎన్‌వీ గోపాలన్

భీమవరం: అమెరికా ప్రకటించిన టారిఫ్‌ల్లో భాగంగా ఆక్వా ఉత్పత్తులపై విదేశీ సుంకం విధింపుపై తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆక్వా రంగాన్ని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ డిమాండ్ చేశారు. శనివారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ సామ్రాజ్యవాద దేశమైన అమెరికాలో అధికారంలోకి వచ్చిన డోనాల్డ్ ట్రంప్ పెట్టుబడిదారి విధానాలను అవలంబిస్తూ ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే మనదేశంపై 26 శాతం సుంకాన్ని విధించడంతో ఆక్వారంగంపై తీవ్ర ప్రభావం చూపనుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారని ట్రంప్ విధించిన సుంకాలతో జిల్లాలో ఆక్వా ఉత్పత్తులపై ప్రభావం చూపాయన్నారు. అమెరికా ప్రకటనతో గంటల వ్యవధిలోనే ఆక్వా ధరలు పతనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రకటనలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏమాత్రం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ప్రధాని మోదీ వెంటనే మౌనం విడాలని డిమాండ్ చేశారు. తక్షణం స్పందిచి నష్టపోతున్న ఆక్వా రైతులను తక్షణం ఆదుకోవాలని గోపాలన్ డిమాండ్ చేశారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం



మాదివాడలో ఆలయ శిఖరం వద్ద అభిషేకం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: శ్రీరామ నవమి సందర్భంగా పలు రామాలయాల్లో సీతారాములోరి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. శనివారం పలు రామాలయాల్లో రాములోరిని పెండ్లి కొడుకుగానూ, సీతమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి పూజలు చేశారు. కల్యాణం అనంతరం అఖండ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. మండలంలోని కొల్లేరు తీరంలోని సిద్ధాపురం గ్రామంలో ఉన్న కోదండ రామాలయంలో శ్రీరామచంద్రమూర్తి, సీతమ్మలను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. స్థానిక వెలంపేట, సంతపేటలోని రామాలయంలోనూ, సిద్ధాపురం రోడ్డులోని రామాలయం వద్ద, చెరుకుమిల్లి గ్రామంలోని రామాలయంలోనూ,చిన కాపవరం, పెదకాపవరం గ్రామంలోని రామాలయాల్లో శ్రీరామ నవమి, సీతారాములోరి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక మాదివాడలో నూతనంగా ప్రతిష్ఠించిన కోదండ రామాలయంలో శిఖ ప్రతిష్ఠకు అభిషేకాలు, బూరెలు వేద మంత్రాల మధ్య వేశారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో శ్రీరామ నవమి ఉత్సవాలకు గ్రామాలు ముస్తాబయ్యాయి. నవమిని పురస్కరించుకుని శనివారం కొన్ని గ్రామాల్లో భజనలతో ప్రత్యేక గీతాలపన చేశారు. ఆదివారం నవమి సందర్భంగా శ్రీ రామాలయాల వద్ద చలువ పందిళ్లు, లేజర్ లైట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, తాగునీటిని ఏర్పాటు చేశారు.

7, 8 తేదీల్లో ముఖాముఖీలు

భీమవరం (ప్రకాశంచౌక్): వివిధ కార్పొరేషన్ల నుంచి స్వయం ఉపాధి రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్వయం ఉపాధి పథకం కింద వివిధ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఈనెల 7, 87 తేదీలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని మున్సిపల్ అధికారులు తెలిపారు. బీసీ, ఓసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని కోరారు.

రైతులు దళారులను నమ్మొద్దు



తుందుర్రులోని ఆర్ఎస్‌కేలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం అర్బన్: జిరైతులు దళారులను నమ్మి మోసపొవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వాటి ద్వారా 6 లక్షల టన్నులు ధాన్యాన్ని సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ నెల మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఆర్ఎస్‌కేల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అధికారులు రైతులకు సహకరించాలన్నారు. ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు మాట్లాడుతూ రైతుల అవసరాలను ముందుగా తెలుసుకుని తీర్చేందుకు అధికారులందరూ పనిచేయాలన్నారు. రైతులు మధ్యవర్తులు, దళారులను నమ్మి మోసపోవదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్స్ సప్లయిస్ మేనేజర్ టి. శివరామ్ ప్రసాద్, డీఎస్‌వో ఎస్ సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, సహాయ సంచాలకులు చింతా శ్రీనివాస్, ఏవో నిమ్మల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు సతీష్, సర్పంచ్ ఆరేటి పెద్దబ్బు, ఎంపీటీసీ, ఆర్ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు జమ చేయాలి



కోలనపల్లి ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కాళ్ల: కోట్లకు అధిపతులైన ఎమ్మెల్యే, ఎంపీల వేతనాలు వారి అకౌంట్లో జమ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెక్కలను నమ్ముకుంటు జీవిస్తున్న ఉపాధి కూలీల వేతనాలు జనవరి నుంచి నేటికీ మూడు నెలలు గడుస్తున్నా జమ చేయకపోవడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కాళ్ల మండల సీఐటీయూ అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని కొలనపల్లి గ్రామంలో శనివారం పర్యటించి చెరువు పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ మూడు నెలల నుండి పనిచేస్తున్నా డబ్బులు రాలేదని తెలిపారు. ఒకపక్క ఎండలు ముదిరిపోతున్న పని ప్రాంతంలో ప్రభుత్వం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెంటనే వేతనాలు జమ చేసి, ఎండ నుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుంపగడప కాలేజీ సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ శోభారాణి

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి శనివారం వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో విద్యా బోధన, కళాశాలలో బోధనేతర సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగు పర్చాలని, కళాశాలలో వసతులు పెరిగినందున విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలని సూచించారు. కార్యాలయ రికార్డులను ఆర్‌జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు తనిఖీ చేశారు. రికార్డుల తయారీలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ పీటీ.ప్రతాప్ కుమార్ ఆర్జేడీతో మాట్లాడి కళాశాల అభివృద్ధి, నాక్ ర్యాంక్ తదితర విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

మల్లేశ్వరికి అభినందనలు



మల్లేశ్వరిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ఏపీ మెడికల్ బోర్డు సభ్యురాలుగా నియమితులైన భీమవరం పట్టణానికి చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ చుండూరు మల్లేశ్వరిని శనివారం డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు సత్కారించారు. అనంతరం బాబు మాట్లాడుతూ పట్టణంలో నిస్వార్థంగా వైద్య సేవలు అందజేస్తున్న మల్లేశ్వరిని ఏపీ మెడికల్ కౌన్సిల్ బోర్డు సభ్యురాలుగా నియమించడం అభినందనీయమన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



భీమవరం: శాసనమండలి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



భీమవరం (ప్రకాశం చౌక్): మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



ఉండి: వాండ్రంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

భీమవరం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి జయంతి వేడుకలు పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి డి ఏసుబాబు, భీమవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి దుర్గాభవానీప్రసాద్, బి నాగబాబు, ఎన్ నర్సింహయ్య, పి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

● శాసనమండలి చైర్మన్ కార్యాలయంలో...

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని భీమవరంలోని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బలే యేసుబాబు, మాజీ సర్పంచ్ బోకూరి విజయరాజు, మంతెన వెంకటబాపిరాజు, మాకిరెడ్డి వెంకటేశ్వరరావు, ఇందుకూరి వర్మ, మెరుపే రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ కె.రామచంద్రారెడ్డి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

భీమవరం అర్బన్: స్వాతంత్ర్యం కోసం, ఐక్యత కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలని రూరల్ ఎస్సై ఐ వీర్రాజు అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాడిన డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా విగ్రహా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రూరల్ ఎస్సై ఐ వీర్రాజు మాట్లాడుతూ సామాజిక సేవలు చేస్తూనే కుల నిర్మూలన నడిపిన గొప్ప ఉద్యమ నాయకుడు డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఎంపీటీసీ తాతపూడి రాంబాబు, బాలం వెంకటేశ్వరరావు, పెనుమాల నరసింహస్వామి, మెరిపే రాజేష్, మందా జాన్, కొత్రాం మను, పలుపుల మోషే తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ మండల గౌరవాధ్యక్షుడు కనపాల ఏసు అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం మండలంలోని వాండ్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పసల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కనపాల శ్యామ్,ఆకుమర్తి రత్నం,కనపాల బాబూరావు, కాపా రెడ్డియ్య, గరికిముక్కుల సామ్యూల్, కాపా చిన్ని, నకపాల పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



కాళ్ల: పెదఅమిరం పార్టీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీవీఎల్

కాళ్ల: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేసిన సంఘ సంస్కర్త, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంతెన సునీల్ వర్మ, పెనుమత్స రంగరాజు, కె.నాగరాజు, వేగేశ్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

ఆడ, మగ అందరూ చదువుకుంటేనే ఆ జాతి అభివృద్ధి చెందుతుందని నినదించిన గొప్ప నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్, డా. బీఆర్ అంబేద్కర్ లని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం మండలంలోని వేంపాడు గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బీవీఎస్‌బీ రామాంజనేయరాజు, సర్పంచ్ యిర్రింకి పద్మావతి, ఎంపీడీఓ స్వాతి, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.